క్లుప్తంగా

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి అనూష

వెంకటగిరి రూరల్: మొక్కలు నాటి వాటి పరిరక్షణకు కృషి చేస్తే వాతావరణ కాలుష్యం తగ్గుతుందని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి న్యాయమూర్తి ఓ.అనూష వెల్లడించారు. పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణం ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజారావు, గాంధీ పాల్గొన్నారు.

పోరుబాట విజయవంతంపై అభినందనలు



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను నిరసిస్తూ వెంకటగిరి పట్టణంలో నిర్వహించిన పోరుబాట కార్యక్రమం విజయవంతం చేసిన కార్యకర్తలు, నాయకులకు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అభినందనలు తెలియపరిచారు. నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని సక్సెస్ చేసినందుకు పేరుపేరునా కృతజ్ఞతలు వ్యక్తపరిచారు. ఇదే స్ఫూర్తితో పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కృషిచేయాలని సూచించారు.

వృద్ధులకు భోజన వసతి



వృద్ధులకు భోజన వసతి కల్పిస్తున్న జేవీవీ సభ్యులు

చిల్లకూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గూడూరులోని ఓం సాయిరాం చారిటీస్‌లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు శనివారం భోజన వసతి కల్పించారు. వేదిక గౌరవ అధ్యక్షుడు పురుషోత్తమరావు అల్లుడు నరేష్ పుట్టిన రోజును పురస్కరించుకుని వృద్ధులకు భోజనాలు అందజేశారు. జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, ప్రభాకర్, సుబ్బారావు, ఇబ్రహీం, శ్రీనివాసులు, ఆశ్రమ నిర్వాహకులు కళ్యాణి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు అధికారుల డుమ్మా

దొరవారిసత్రం: మండలం పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులకు రెవెన్యూ శాఖ అధికారులు తప్ప మిగిలిన శాఖల అధికారులు డుమ్మా కొడుతున్నారు. శనివారం తనియాలి గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు హాజరు కావాల్సిన దేవదాయ, ఫారెస్ట్, వక్ఫ్ శాఖ అధికారులు కాని, సిబ్బంది కాని హాజరు కాకపోవడం గమనార్హం. ఈ సదస్సులో వైస్ఎంపీపీ గోపాల్‌రెడ్డి, సర్పంచ్ సుబ్బమ్మ, ఆర్ఐ ప్రవీణ్‌రాయల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పని తీరు మార్చుకోకపోతే చర్యలు



ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి

చిల్లకూరు: వైద్య సిబ్బంది పని తీరు మార్చుకోక పోతే శాఖా పరమైన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి బాలక్రిష్ణనాయక్ హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని బనిగేసాహెబ్ పేటలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో పని చేసే సిబ్బంది తీరు సరిగా లేకపోవడం, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలుసుకుని నియోజకవర్గంలోని అన్ని వైద్యశాలలకు సంబంధించిన వివరాలు అందజేశారు.

సర్వీస్ ప్రొవైడర్లకు అవగాహన

గూడూరు రూరల్: సర్వీస్ ప్రొవైడర్లుగా ఉండే వారికి జీవనోపాధి కల్పించేలా చర్యలు చేపడుతున్నామని మెప్మా పీడీ రవీంద్ర తెలిపారు. గూడూరు మున్సిపల్ కార్యాలయంలో శనివారం సర్వీస్ ప్రొవైడర్లకు మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మెప్మా ద్వారా ప్రభుత్వం బూటీషియన్, మహిళ, పురుషులు, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్, ప్లంబర్ తదితర పనులు చేసే వారికి ఎన్ఎస్‌డీఎస్ ద్వారా శిక్షణ ఇప్పించి వారికి సర్టిఫికెట్లులు అందిస్తామని అన్నారు. అలా శిక్షణ పూర్తి చేసుకున్న సర్వీస్ ప్రొవైడర్లకు పని కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మెప్మా, సిటీ మిషన్ మేనేజర్ పెంచలయ్య, ప్రమీల, చందన, లత పాల్గొన్నారు.



గ్రామానికి వెళ్లే మార్గం



శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం



గోకుల బృందావనంలోని గ్రంథాలయం

మాయమైందీ... గోకుల బృందావనం

సైదాపురానికి కూత వేటు దూరంలోనే గోకుల బృందావనం ఊరు ఉంది. అక్కడ అంతా యాదవులే నివశిస్తుండేవారు. ప్రతి ఏటా ఆ గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడం ప్రారంభించారు. చాలా కుటుంబాలు ఇలా వలస పోయాయి. అంతా మండల కేంద్రానికి మకాం మార్చడంతో ఆ పల్లె బోసిపోయింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలోని గోకుల బృందావనం పల్లె కథ ఇది.

–సైదాపురం

- గతంలో ఓ వెలుగు వెలిగిన ఆ పల్లె
- అంతా యాదవులే... ఆ ఊరి నుంచి మండల కేంద్రంలో మకాం
- ప్రస్తుతం ఆ గోకులంలో 66 మంది ఓటర్లు
- జిల్లాలోనే అతి చిన్న పంచాయతీ



పాడు బడిన భవనం



మంచినీటి పథకం ట్యాంకు

గత చరిత్ర చూస్తే గోకుల బృందావనం చుట్టుపక్కల అపారమైన ఖనిజ సంపద నిల్వలు కూడా ఉన్నాయి. వందల ఎకరాల భూములున్నా ఆ పల్లెలో ప్రస్తుతం పాఠశాల భవనాలు, పంచాయతీ కార్యాలయాలు, లక్షలు విలువ చేసే సీసీ రోడ్డు మాత్రం ఉన్నాయి. అయితే జనాలు మాత్రం కనిపించరు. గతంలో గ్రామానికి నలువైపులా మైకా గనులు విస్తారంగా ఉండడంతో ఆ పల్లెలో 350 మందికి పైగా జీవనం సాగించేవారు. ఇరువైపులా ఉన్న గనులు పూర్తి స్థాయిలో నిలిచిపోవడంతో ఆ గ్రామం కూడా రోజురోజుకు కుచించుకుపోతోంది. చివరకు 66 మంది ఓటర్లుగా మిగిలారు. బత్తల పల్లి, ఆవుల ఇంటిపేర్లుతోపాటు దొడ్డగ అనే ఒక ఇంటి వారు మాత్రమే ఉండేవారు. వీరిలో వంతుల వారీగా సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకునే ఆనవాయితీ కూడా ఉండేది. ఈ క్రమంలో ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు విడుదల చేసే నిధులతో కొంత మేర అభివృద్ధి పనులు చేపట్టారు. 2012లో జరిగిన స్థానిక ఎన్నికల్లో మాత్రమే ఈ పంచాయతీలో పోటీ జరిగింది. మహిళలకు కేటాయించడంతో ముగ్గురు మహిళలు పోటీ చేశారు. చివరకు ఆవుల రమాదేవి విజయం సాధించారు.

తరలిన పల్లె జనం

గోకుల బృందావనం వాసులంతా సైదాపురం తరలివెళ్లిపోయారు. వారంతా తహశీల్దార్ కార్యాలయం ఎగువ ప్రాంతంలోని ఎంఎస్ కాలనీలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. కొందరు సైదాపురంలో మరో కాలనీగా ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. చివరకు ఊరిలో మాత్రం కేవలం రెండు ఇళ్లే మిగిలాయి. పల్లె చుట్టూ ఉన్న భూముల్లో అపారమైన ఖనిజ నిక్షేపాలు ఉండడంతో ఆ పల్లెలో ఉన్న వందలాది ఎకరాల భూముల విలువ ప్రస్తుతం లక్షలు దాటుతోంది. ఎకరా రూ.35 లక్షల వరకు ధర పలుకుతుందంటే అక్కడి భూమి విలువ అర్థమవుతోంది.

మమకారం వదల లేకున్నాం...



ఊరిపై ఉన్న మమకారం వదలలేక రోజుకోసారి పోతున్నాం. చుట్టుపక్కల ఉన్న తమ భూముల్లో సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. నిమ్మ తోటలను పెంచుకుంటున్నాం. చిన్నప్పటి జ్ఞాపకాలు నేటికీ గుర్తుకువస్తున్నాయి. మొన్నటి వరకు మా తల్లి కూడా ఊర్లోనే ఉండేది. ఆమెను చూసుకునేందుకు నిత్యం వెళ్తుండేవాళ్లం. ఆమె కూడా ఇటీవల సైదాపురం వచ్చేసింది. దీంతో ఊరిలో ఎవరూ నివాసం లేకుండా నిర్మానుష్యంగా మారింది.

–ఆవుల సాంబయ్య

ముప్పయ్యేళ్ల క్రితం ఊరి నుంచి వచ్చేశాం



ముప్పయ్యేళ్ల క్రితం ముగ్గురు అన్నదమ్ములం కలిసి ఊరి నుంచి సైదాపురానికి కాపురం వచ్చేశాం. అక్కడే పుట్టి పెరిగాం. చదువుల కోసం మేమంతా ఊరు వదిలేశాం. చుట్టు పక్కల కొండలు, కాలువలు, పక్కనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన సిద్ధలయ్య కోన ఉండేది. ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది మా ఊరు. ప్రస్తుతం కళాహీనంగా మారడం చూస్తుంటే బాధ కలిగిస్తోంది.

–దొడ్డగ మునెయ్య

చదువుల కోసం వచ్చేశాం



మా చదువుల కోసం మేమంతా ఊరి నుంచి సైదాపురం వచ్చేశాం. ఇక్కడే ప్రభుత్వం స్థలాలు కూడా ఇవ్వడంతో ఇళ్లు కట్టుకున్నాం. ఉన్నత చదువులు చదువుకుని నేడు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నాం. కేవలం చదువుల కోసమే ఊరు వదిలిపెట్టాం. సెలవు దినాల్లో మా ఊరికి వెళ్లి స్నేహితులతో కలిసి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నాం.

–బత్తలపల్లి వీరరాఘవులు

ఆదివారం కూడా విద్యుత్ బిల్లుల చెల్లింపులు

నాయుడుపేట టౌన్: ఆదివారం కూడా విద్యుత్ శాఖకు సంబంధించిన ప్రభుత్వ బిల్లుల వసూళ్ల కేంద్రాలు పనిచేస్తాయని, విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునని ఈఈ శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్ ఈఈ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డివిజన్ పరిధిలోని నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి విద్యుత్ సబ్ డివిజన్‌ల పరిధిలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కేంద్రాలు ఆదివారం యథావిధిగా పనిచేస్తాయన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి



రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న తహశీల్దార్ శ్రీనివాసులు

చిల్లకూరు: గ్రామంలోని భూ సమస్యలను త్వరగా పరిష్కరించి పేదలకు న్యాయం చేయాలని కేఎస్‌పీఎస్ నాయకుడు కావలి బాలయ్య కోరారు. మండలంలోని ఏరూరు గ్రామంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరూరు గ్రామంలో ప్రభుత్వ భూములను గుర్తించి వెంటనే వాటిని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ పూర్ణ, రెవెన్యూ సిబ్బంది, నాయకులు పూడిపర్తి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లకొండలో రాపూరు సీఐ విచారణ

కలువాయి: మండలంలోని పల్లకొండలో రాపూరు సీఐ ఎస్.సత్యనారాయణ శనివారం పర్యటించారు. గ్రామానికి చెందిన కొల్లూరు గోపి ఈ నెల 11వ తేదీన హత్యకు గురైన విషయం విదితమే. హత్య కేసును ఛేదించడంపై పోలీసు యంత్రాంగం దృష్టి సారించింది. ఇప్పటి వరకు పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేసినా ఇప్పటి వరకు కేసులో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో రాపూరు సీఐగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఎస్.సత్యనారాయణ శనివారం పల్లకొండలో గోపి హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. గ్రామంలో గోపి కుటుంబ సభ్యులను కలిసి విచారణ జరిపారు. ఆయన వెంట కలువాయి పోలీసులు ఉన్నారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణమ్మ

చిల్లకూరు: మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా ముగిసింది. శనివారం మండల పరిషత్ అధ్యక్షురాలు తుపాకుల వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీపీతో కలసి నలుగురు సభ్యులు హాజరు కావడంతో సమావేశం ఆరంభించారు. అయితే ఇద్దరు మహిళా సభ్యులు రిజిస్టర్‌లో సంతకాలు చేసేసి వెళ్లిపోయారు. దీనిని కనీసం గుర్తించని ఎంపీడీఓ గోపి సమావేశం పూర్తి చేశారు. ఎంపీడీఓను వివరణ కోరగా కోరంకు అవసరమైన సభ్యులు హాజరైతే చాలు, సమావేశం నిర్వహించుకోవచ్చని మాట దాట వేశారు.

ఎస్ఎంసీ సభ్యులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఎంఈఓ

నాయుడుపేట టౌన్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు రిసోర్స్ పర్సన్‌లు శనివారం శిక్షణ తరగతులను నిర్వహించారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సూళ్లూరుపేట, గూడూరు డివిజన్ పరిధిలోని మొత్తం 16 మండలాలకు చెందిన ఎస్ఎంసీ సభ్యుల్లో ఒకరు, ఒక ఉపాధ్యాయుడికి శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. శిక్షణ పొందినవారు ఇతర సభ్యులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంఈఓ మునిరత్నం, ఏఎస్ఓ సారధి, అసిస్టెంట్ సీఎంఓ రాము, గూడూరు ఉప విద్యాశాఖాధికారి సనత్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

గూడూరు రూరల్: శారద నగర్ ప్రాంతంలోని చెరువు కట్టపై ఉంటున్న గిరిజనులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. గూడూరు రోటరీ వెస్ట్ క్లబ్ చేపట్టిన ఈ సేవా కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాశిన నాగులు మాట్లాడుతూ హవిస్మతి అనే చిన్నారి పుట్టిన రోజును పురస్కరించుకుని దుప్పట్లు అందిస్తున్నామని తెలిపారు. పిల్లలకు బిస్కెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. సీనియర్ రోటేరియన్‌లు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంఠి రామోహన్‌రావు, చోళవరం గిరిబాబు, బొమ్మిడి శ్రీనివాసులు, నాగరాజురెడ్డి, శివశంకర్, బలరామిరెడ్డి, స్వర్ణ, రాజశేఖరరెడ్డి, స్పందన పాల్గొన్నారు.

బోటు షికారుకు సన్నాహాలు

తడ: ఫ్లెమింగో ఫెస్టివల్‌లో సందర్శకులు బోటు షికారు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఫిషరీస్ డీడీ నాగరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత ఫెస్టివల్ సందర్భంగా మత్స్యకారులకు చెల్లించాల్సిన బకాయిలను ఇప్పిస్తామని, పడవలను సిద్ధం చేయాలని కోరారు. ఈమేరకు బీవీపాళెం పడవల రేవు వద్ద ఆయన స్థానిక మత్స్యకార నాయకులతో మాట్లాడారు.

సేవా గుణం అలవరచుకోవాలి



వృద్ధులకు దుస్తులు, బిర్యానీ ప్యాకెట్ల పంపిణీ

నాయుడుపేట టౌన్: సేవా గుణాన్ని అలవరచుకోవాలని బాషా పాఠశాల కరస్పాండెంట్ హాజీ రఫీ బాషా కోరారు. హ్యూమానిటీ డే సందర్భంగా శనివారం బాషా పాఠశాల ఆధ్వర్యంలో పట్టణం లోని మేరీ, జీసస్ ఫౌండేషన్ వృద్ధుల ఆశ్రమం, చేయూత అనాథ పిల్లల ఆశ్రమంలో ఉన్నవారికి దుస్తులు, బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ హమీద్ బాషా, జామీయ మసీదు మౌలానా అబ్బు బకర్, అబ్దుల్లా భాయ్ పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్

తడ: హైవే పక్కనే ఉన్న దుకాణం వద్ద శనివారం మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిపోయాడో దొంగ. ఎస్ఐ కొండపనాయుడుకి అందిన ఫిర్యాదు మేరకు తడకండ్రిగలోని నిప్పో ఫ్యాక్టరీ ఎదుట టీ దుకాణం నిర్వహిస్తున్న చీకోలు లక్ష్మి వద్దకు బైక్‌పై వచ్చిన దుండగుడు నీళ్ల బాటిల్ అడిగాడు.బాటిల్ తీసేందుకు తిరిగిన మహిళ మెడలో నుంచి మూడు సవర్ల చైన్ లాక్కుని పారిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మాట్లాడితే ప్రజలే బుద్ధి చెబుతారు

నాయుడుపేట టౌన్: సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లో దందాలు నడుపుతున్న తీరుపై ప్రశ్నిస్తే అవాకులుచవాకులు మాట్లాడితే ప్రజలే నాలుకలు తెగ్గొడుతారని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తీవ్రంగా విమర్శించారు. గంగాప్రసాద్ 2014, 2019లో ఎందుకు గెలిపించుకోలేదని ఆయన ప్రశ్నించారు. వారి అవినీతిని బట్టబయలు చేస్తున్న విలేకరులను బెదిరించడం మానుకోవాలని సత్యనారాయణరెడ్డి హితవు పలికారు. సూళ్లూరుపేట నియోజవర్గ మహిళా ఎమ్మెల్యేను తాము ఎంతో గౌరవిస్తామన్నారు. అయితే ఆమె పేరు చెప్పి వారి స్వగ్రామమైన భీమవరం స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ తరలింపులు, భారీ డంపింగ్ యార్డులను పట్టించుకోవాలన్నారు. దీనిపై న్యాయ స్థానాన్ని ఆశ్రయించి అందరి భరతం పడుతామన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు పరామర్శ



నెల్లూరు సెంట్రల్ జైలు ఆవరణలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): పట్టణంలోని 14వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త తంగా పేచీరాజ్‌ను నెల్లూరు సెంట్రల్‌జైలులో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు రెడ్‌బుక్ పాలన అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్ సీపీ కార్యకర్త పేచీరాజ్‌పై గంజాయి అక్రమ కేసులు నమోదు చేసి జైలు పాలు చేసినట్లు ఆరోపించారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఆందోళన పడొద్దన్నారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించి తగు చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బాలాయపల్లి మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి, డక్కిలి జేసీఎస్ కన్వీనర్ చింతల శ్రీనివాసులురెడ్డి, పేచీరాజ్ కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి



రాజశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

పెళ్లకూరు: ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో అమలు చేస్తున్న పలు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి అన్నారు. శనివారం తాళ్వాయిపాడులోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో అక్కగారిపేట గ్రామానికి చెందిన నరసింహులును బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం కొత్తగా ఎన్నుకోబడిన నరసింహులును శాలువాలతో నాయకులు సన్మానించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, నాయకులు మురళి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా పాపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప తదితర నాయకులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాజశేఖర్ రెడ్డిని రెండోసారి పట్టణ అధ్యక్షుడిగా నియమించారు. బీజేపీ నాయకులు అమరావతి రామయ్య, ఆశా చెంచుకృష్ణయ్య, చిగురాకుల సురేంద్ర, కంట్రాతి సుందరరావు, గాదంశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మలో దిగుబడుల పులుపు

- నిమ్మ తోటల్లో పూత ఆలస్యం
- సీజన్‌లో దిగుబడిపై సందిగ్ధం
- ఆందోళనలో అన్నదాతలు



పూత లేని నిమ్మ చెట్లు



నిమ్మ తోటలు

డక్కిలి: నిమ్మ తోటలు విస్తారంగా ఉన్న డక్కిలి మండలంలో చెట్లకు పూత రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అక్టోబర్ నుంచి వరుస తుపాన్‌లతో తోటలు దెబ్బతిన్నాయి. మళ్లీ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించిన నేపథ్యంలో అన్నదాతలు దిగాలు చెందుతున్నారు.

సాధారణంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో తోటల్లో పూత వస్తే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో దిగుబడి పెరిగి రైతులకు గిట్టుబాటు ధరలు లభించేవి. పూత రావడంలో ఆలస్యం జరిగినా లేదా రాకున్నా వేసవిలో కాయల దిగుబడి తగ్గుతుంది. డక్కిలి మండలంలో సుమారుగా 2,500 హెక్టార్లులో నిమ్మపంట సాగవుతోంది. ముసురు వానల నేపథ్యంలో తోటలు చిత్తడిగా మారి ఉన్న కాయలను కోయలేక నెల రోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. అయితే ధరల్లేని సమయంలో కోతలు పెద్దగా పట్టించుకోని రైతులు పూత విషయంలో మాత్రం ఆందోళన చెందుతున్నారు. మంచు వల్ల కాయలపై మచ్చలు ఏర్పడుతుండటంతో మరికొంత నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

నేలలో తేమ శాతం అధికం కావడం

ఎండలు కాస్తే నిమ్మ తోటల రైతుల ఇబ్బందులు తొలగిపోతాయి. నేలలో తేమశాతం పెరగడంతో చీడ పీడలతో పాటు పూత రావడం అలస్యమవుతోంది. చలికాలంలో ఎండ కాస్తే భూమిలో తేమ శాతం తగ్గి పూత వచ్చేందుకు అవకాశం ఉంటుంది. మళ్లీ వర్షాలు కురిస్తే పూత రావడం ఆలస్యమై సీజన్‌లో కాయల దిగుబడి లేకుండా పోతుందని రైతులు నిరాశ చెందుతున్నారు. సాధారణంగా నిమ్మకు మార్కెట్‌లో జనవరి నెల చివరి నుంచే ధరలు పెరగడం ప్రారంభమవుతుంది. ఈ సమయంలో నిమ్మకు పూత రాకపోవడంతో అన్నదాతలు నిరాశలో కూరుకపోతున్నారు.

పూత రావడం కష్టమే..



ఈ ఏడాది నిమ్మ తోటల్లో పూత రావడం అనుమానమే. మళ్లీ అల్పపీడనం ప్రభావంతో ముసురు పట్టింది. ముసురు పట్టి వర్షం కురుస్తోంది. దీంతో తోటల్లో తేమ శాతం పెరిగే కొద్దీ పూత రావడంలో జాప్యం జరుగుతుంది. ఫలితంగా సీజన్‌లో కాయలు దిగుబడి తగ్గిపోతుంది. ధరలు లేని సమయంలో దిగుబడి పెరుగుతుంది.

–కోలా మీరయ్య నాయుడు, రైతు

అధికారుల సూచనలు పాటించాలి



ప్రస్తుతం వర్షాలు అధికంగా కురవడంతో నిమ్మ తోటల్లో తేమ శాతం అధికంగా ఉంది. దీంతో పూత పూసేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవు. నిమ్మ తోటల్లో తేమ శాతం తగ్గిన తర్వాత పూత వచ్చేందుకు అవకాశం ఉంది. పూత కోసం రైతులు ఫార్ములా-4 లేదా ఆర్కా నిమ్మ స్పెషల్ పౌడి మందును లీటరు నీటికి నాలుగు గ్రాముల చొప్పున మొక్కలు మీద పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుంది.

–ఆనంద్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారి, వెంకటగిరి